# సాక్షి సంగారెడ్డి

శనివారం | 21 | సెప్టెంబర్ | 2024






## ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు?

మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎనిమిది ఏళ్లు అవుతున్నా ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేరు.

వివరాలు 8లో ▸



## బంగారం కోసమే మహిళ హత్య

బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వివరాలు 8లో ▸

## దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: జిల్లాలో అత్యుత్తమ వయో వృద్ధులు, నిరుపేద సీనియర్ సిటిజన్లకు విశిష్ట సేవలు అందించడంలో నిమగ్నమైన అర్హులైన సంస్థలకు రాష్ట్ర స్థాయి అవార్డుల అందజేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వయో వృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9652394751 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## న్యూస్‌రీల్

### 10 వేల 'ధరణి' సమస్యలు పరిష్కారం

**మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**



**మెదక్ కలెక్టరేట్:** రెండున్నర నెలల్లో పది వేల ధరణి సమస్యలు పరిష్కరించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం పెండింగ్ ధరణి అర్జీలను పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. జూలై 1వ తేదీ నాటికి జిల్లాలో సుమారుగా 10,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చిన దరఖాస్తులతో 14,000 అయినట్లు తెలిపారు. గడిచిన రెండున్నర నెలల్లో పదివేల దరఖాస్తులు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన దరఖాస్తులను కూడా అతి త్వరలో పరిష్కరిస్తామన్నారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో పెద్దఎత్తున ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### అర్హులందరికీ పంట రుణాలు

సాక్షి స్పందన

**వెల్దుర్తి(తూప్రాన్):** డీసీసీబీలో దా'రుణాలపై' సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి డీసీసీబీ డైరెక్టర్, పీఏపీఎస్ చైర్మన్ అనంతరెడ్డి స్పందించారు. పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములున్న అర్హులైన రైతులకు పంట రుణాలు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం రుణమాఫీ పొందిన రైతులకు రెన్యూవల్ చేస్తున్నామని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈసంవత్సరం రైతులు ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకున్నారని, ఫండ్స్ కోసం జిల్లా ఉన్నతాధికారులు (నాబార్డ్)కు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఎవరైనా రైతులు అర్హత ఉండి పంట రుణాలకు కొత్తగా దరఖాస్తు చేసుకుంటే వారికి నిధులు రాగానే పంపిణీ చేస్తామన్నారు. పంట రుణాల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

### జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**నర్సాపూర్:** మండల స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నసీమాషేక్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

### మీసేవకు అంతరాయం

**సంగారెడ్డి క్రైమ్:** మీసేవ కేంద్రాల్లో పౌర సేవలు నిలిచిపోయాయి. సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలకు అంతరాయం ఏర్పడింది. కులం, నివాసం, ఆదాయం తదితర ధృవీకరణ పత్రాలతో పాటు సుమారు 40 రకాల సేవలను ప్రజలు వినియోగించుకుంటున్నారు. సేవలు నిలిచిపోవడంతో జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగి తిరిగి విసుగు చెందుతున్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్రాంత పోలీస్ ఉద్యోగులు

**సంగారెడ్డి జోన్:** విశ్రాంత పోలీస్ ఉద్యోగుల సమస్యల సాధనకు కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాలస్వామి అన్నారు. ఇటీవల జిల్లా నుంచి నూతనంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్యతో కలిసి శుక్రవారం ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అఫ్జల్, జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, జీవన్, జహంగీర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### మంత్రులు మౌనం సరికాదు

**మెదక్ కలెక్టరేట్:** విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ ప్రశ్నించారు. శుక్రవారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌ల సాధనకు ఈనెల 27న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా విద్యారంగంలో ఉన్న పెండింగ్ బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, నాయకులు అజయ్, భాను పాల్గొన్నారు.



రక్షణ కిట్



కిట్ వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

# గౌడన్నలకు కాటమయ్య రక్ష

- త్వరలో సేఫ్టీ మోకుల పంపిణీ
- అవగాహన కల్పించిన అధికారులు
- జిల్లాలో 41 మంది గుర్తింపు

**సంగారెడ్డి జోన్:** కులవృత్తులను బలోపేతం చేస్తూ ప్రమాదాల బారి నుంచి వారిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గీత కార్మికులకు 'కాటమయ్య' రక్ష పేరుతో సేఫ్టీ మోకుల పంపిణీకి సమాయత్తం అవుతోంది. వారి రక్షణ కోసం నూతన కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 41 మంది గీత కార్మికులకు గుర్తించింది. సుల్తాన్‌పూర్‌లోని కోర్పోల్ రోడ్డు సమీపంలో కిట్టు వినియోగంపై ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. పలు ప్రాంతాల్లో గతంలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయి గాయపడి, మృతిచెందిన సందర్భాలు సైతం ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**ప్రమాదాల నివారణకు చర్యలు**

తాటి చెట్లు ఎక్కుతున్న సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కిట్లను పంపిణీ చేస్తున్నారు. చెట్టు ఎక్కిన సమయంలో జారి కింద పడకుండా ఉండేందుకు ధృఢమైన బెల్టుతో పాటు మూడు క్లిప్పులు ఉంటాయని తెలిపారు. సుమారు 300 కిలోల బరువు మోసే విధంగా కిట్టును రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. దీని విలువ సుమారు రూ.15,000 ఉంటుందని, ప్రభుత్వం గీత కార్మికులకు ఉచితంగా పంపిణీ చేస్తుందని వివరించారు. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులతో గీత కార్మికులకు కిట్టుపై వినియోగంపై అవగాహన సైతం కల్పించినట్లు చెప్పారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



తాటి చెట్టు ఎక్కిన సమయంలో ప్రమాదాల బారి నుంచి కాపాడుకునేందుకు అందించే కాటమయ్య రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి. ఇటీవలే కిట్టు వినియోగంపై అవగాహన కల్పించాం. జిల్లాలో గుర్తించిన 41 మందికి త్వరలో కిట్లను అందజేస్తాం.

– జగదీష్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి

# తల్లీబిడ్డల సంక్షేమానికి ప్రాధాన్యం

**సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**సంగారెడ్డి జోన్:** తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మాత, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. కిషోర బాలికల రక్తహీనత నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. పోషకాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ప్రతిరోజు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పాలు, గుడ్లతో పాటు పోషకాహారం అందించాలన్నారు. వైద్య, మాతా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాతా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి, జిల్లా వైద్యశాఖ అధికారి గాయత్రీదేవి, డీఈఓ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ గీత, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి బాలామృతం తినిపిస్తున్న కలెక్టర్ క్రాంతి

## సమయపాలన తప్పనిసరి: డీఎంహెచ్ఓ

**కౌడిపల్లి(నర్సాపూర్):** వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ శ్రీరామ్ ఆదేశించారు. శుక్రవారం కౌడిపల్లి పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు విధులకు హాజరై రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనుమతి లేకుండా సెలవు తీసుకోవద్దని చెప్పారు. కౌడిపల్లి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఒకేచోట ఉండడంతో పీహెచ్‌సీని వెంకట్రావుపేట గేట్ వద్దకు తరలించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. చిలప్‌చెడ్‌కు గతేడాది పీహెచ్‌సీ మంజూరు కాగా 20 గుంటల స్థలం సైతం కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేయగా, భవన నిర్మాణం కోసం టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు. సీహెచ్‌సీకి నలుగురు వైద్యులను నియమించామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన, జిల్లా ప్రోగాం అధికారి డాక్టర్ నవీన్, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఫెర్నాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీరామ్

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి**

**ఝరాసంగం(జహీరాబాద్)/న్యాల్‌కల్:** గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఎల్గోయిలో మండల అధ్యక్షుడు విశ్వనాథం ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బసవపురం లక్ష్మీనరసయ్య కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఇన్‌చార్జి విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, భాస్కర్ యాదవ్, నర్సింలు, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యాల్‌కల్‌లో బూత్‌స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శ్రమదానం చేసి మొక్కలు నాటారు. అందరూ కలిసికట్టుగా పని చేసి సభ్యత్వ నమోదు చేయించాలని పిలుపునిచ్చారు.



న్యాల్‌కల్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న గోదావరి, నాయకులు

## పెండింగ్ బిల్లులు విడుదల చేయండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

**సంగారెడ్డి ఎడ్యుకేషన్:** సంక్షేమ హాస్టళ్లు, గురుకుల వసతి గృహ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంతో పాటు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలతో పోలిస్తే ప్రస్తుతం ఇస్తున్న మెస్ చార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. భవనాలు సైతం శిథిలావస్థలో ఉన్నాయని, వెంటనే నూతన భవనాలను అన్ని హంగులతో నిర్మించాలన్నారు. ప్రతి దళిత కుటుంబానికి అంబేడ్కర్ అభయహస్తం కింద రూ. 12 లక్షలు వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ ఈనెల 23న హైదరాబాద్‌లోని సంక్షేమ భవనం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి దాసు, నాయకులు సుదర్శన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## 27న జాయింట్ పార్లమెంట్ కమిటీ రాక

**జహీరాబాద్:** ఈనెల 27వ తేదీన వక్ఫ్‌బోర్డు అంశంపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) హైదరాబాద్‌కు వస్తున్నట్లు రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. 28వ తేదీన ఉదయం 9 గంటలకు రైతులు, భూబాధితుల నుంచి అభిప్రాయాలను సేకరించడంతో పాటు 2024 వక్ఫ్‌చట్ట సవరణ బిల్లు ప్రతిపాదనలపై చర్చిస్తారని పేర్కొన్నారు. వక్ఫ్ భూ బాధిత రైతులు, న్యాయ నిపుణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి తమ వాదనలు, వాస్తవాలను వినిపించాలని కోరారు.





## ఇదేం దారి?

కంది మండలం కాశీపూర్ నుంచి చెర్లగూడెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దారి పొడవునా గుంతలు ప్రమాదకరంగా మారాయి. కొన్నికోట్ల రోడ్డు మధ్యలో ఫీటు మేర ఎత్తు పల్లాలు ఏర్పడ్డాయి. రాత్రి వేళలో పలువురు రైతులు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

## సాయుధ దళాలలో ప్రవేశానికి అవకాశాలు

**లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ అబ్రహం**

**పటాన్‌చెరు:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రుద్రారంలోని ఎన్‌సీసీ యూనిట్‌ను నిజామాబాద్‌లోని 33 (తెలంగాణ) బెటాలియన్ ప్రధాన కార్యాలయ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహం శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన వెంట 33వ బెటాలియన్ సంగారెడ్డి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ సిరియాల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదనరావు ఉన్నారు. సునీల్ అబ్రహం ఎన్‌సీసీ క్యాడెట్లతో చర్చించి పనితీరును ప్రశంసించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో విద్యార్థి బయోడేటా విలువ పెరుగుతుందని, ఉద్యోగ అవకాశాలను 30 శాతం పెంచుతుందని చెప్పారు. సాయుధ దళాలలో ప్రవేశానికి అవకాశాలు ఉన్నాయని, మహారాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఐదు శాతం వెయిటేజీని ఇచ్చిందని వెల్లడించారు. అనంతరం ఆయన జాతీయ, అంతర్జాతీయ శిబిరాలలో పాల్గొనడానికి ఎంపికైన పలువురు క్యాడెట్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈసందర్భంగా కల్నల్ సునీల్‌ను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, రెసిడెంట్ డైరెక్టర్ వర్మ, అధ్యాపకులు సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్నల్ సునీల్ అబ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

## విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

**రామాయంపేట(మెదక్):** జెడ్పీ సీఈఓ ఎల్లయ్య శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ సజీలుద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్‌పై హైడ్రాకు ఫిర్యాదు

**పటాన్‌చెరు:** అమీన్‌పూర్ తహసీల్దార్‌పై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువు భూములు కాపాడాల్సిన అధికారులే కంచె చేను మేసిన చందంగా చెరువు బఫర్‌జోన్‌లో క్రయ విక్రయాలకు వ్యవసాయేతర భూమిగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గతంలోనే అక్కడ వెలిసిన వెంచర్‌కు ఆ భూమిని ఇస్తే అది బఫర్ పరిధిలోకి వస్తుందని నిర్వాహకులు విడిచిపెట్టారు. తాజాగా ఆ భూమికి నాలా కన్వర్షన్ ఇస్తూ క్రయవిక్రయాలకు అనుమతి ఇవ్వడంపై స్థానికులు నేరుగా హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి**

**సంగారెడ్డి:** కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మెడ్వాన్ కార్యాలయంలో గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలు, హక్కులపై అవగాహనా కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులంతా హక్కులను కాపాడుకునేందుకు తోటి వారితో కలిసికట్టుగా ఉండాలని సూచించారు. గృహ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను తెలుసుకొని పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడి

# బడికి నిర్వహణ నిధి

**సమగ్ర శిక్ష నిధులు విడుదల**

- జిల్లాకు రూ. 1.28 కోట్లు
- 50 శాతం ఎస్ఎంసీ ఖాతాల్లో జమ
- పాఠశాలల హెచ్ఎంలకు ఊరట

**పాపన్నపేట(మెదక్):** ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం సమగ్ర శిక్ష నిధులు రూ. 1,28,12,500 మంజూరయ్యాయి. మొదటి విడతగా 50 శాతం నిధులు పాఠశాల ఎస్ఎంసీ ఖాతాల్లో జమ అయ్యాయి. మెదక్ జిల్లాలోని జెడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, ఆదర్శ, ట్రైబల్ వెల్ఫేర్, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఏటా ఈ నిధులు మంజూరు చేస్తుంది. వీటితో పాఠశాలల నిర్వహణ కొనసాగుతోంది. అయితే ఈసారి విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే భరించనున్నట్లు స్పష్టం చేయడంతో హెచ్ఎంలకు ఊరట లభించింది.

**మొత్తం 877 పాఠశాలలు**

జిల్లాలో మొత్తం 877 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఏటా స్టేషనరీ, చాక్‌పీస్‌లు, వైట్ పేపర్స్, రిజిస్టర్ల కొనుగోలు, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపు, కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, కెయాన్, ఆర్వోటి, ల్యాబ్ మెటీరియల్, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్ల నిర్వహణ, హ్యాండ్‌వాష్ లిక్విడ్, స్పోర్ట్స్ సామగ్రి కొనుగోలు, మైనర్ రిపేర్లు, జాతీయ పండగలు, ఆటపోటీల నిర్వహణ కోసం ఏటా సమగ్ర శిక్ష నిధులు విడుదల చేస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు మంజూరవుతాయి. 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే ఏడాదికి రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు రూ. 25 వేలు, 101 నుంచి 250 వరకు రూ. 50 వేలు, 251 నుంచి 1,000 వరకు రూ. 75 వేలు, 1000కి పైగా విద్యార్థులు ఉంటే రూ. 1 లక్ష విడుదల చేస్తారు.

**విద్యుత్ బిల్లుల మినహాయింపు**

ఎస్ఎంసీ నిధుల నుంచి విద్యుత్ బిల్లులను మినహాయించంతో హెచ్ఎంలలో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో పాఠశాల నిధుల్లో సగభాగం విద్యుత్ బిల్లులకు సరిపోయేది. దీంతో ఇతర అవసరాలు తీర్చుకునేందుకు హెచ్ఎంలు నానాతంటాలు పడేవారు. 50 శాతం నిధులు సకాలంలో రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గాంధారిపల్లి ప్రాథమిక పాఠశాల

**నిధుల ఖర్చుకు మార్గదర్శకాలు**

పాఠశాల అవసరాలకు అనుగుణంగా తీర్మానాలు చేసి ఖర్చు చేయాలి. ఎస్ఎంసీ ద్వారా సోషల్ ఆడిట్ నిర్వహించాలి. నిధుల మంజూరు, ఖర్చు, మిగులు పాఠశాలల నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలి. మొదటి విడత నిధుల ఖర్చు తర్వాత రెండో విడత మంజూరవుతాయి. నిధుల నిర్వహణలో సంబంధిత హెచ్ఎంలు బాధ్యత వహించాలి.

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఒక వెండి, కాంస్య పతకం లభించాయి. రాఘవపూర్‌కు చెందిన లీలా ఆనంద్ వెండి పతకం, కొండపాకకు చెందిన నగేశ్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామి అభినందించారు.

### కుమారుడితో సహా తల్లి అదృశ్యం


లక్ష్మీ, ప్రణయ్

పటాన్‌చెరు టౌన్: తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వడ్డెర కాలనీకి చెందిన సాయికుమార్(20) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 18న సాయికుమార్ భార్య లక్ష్మీ, కుమారుడు ప్రణయ్ (11 నెలలు)తో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి ఇద్దరూ కనిపించకుండా పోయారు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

### కమీషన్ పేరుతో రూ.5.45 లక్షలు మోసం

పటాన్‌చెరుటౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ వ్యాపారి భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారికి టాస్కులు, కమీషన్ పేరుతో 5వ తేదీన మెసేజ్ వచ్చింది. ఆ వ్యాపారి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఓ వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని నమ్మించడంతో ఉద్యోగి పలు దఫాలుగా రూ.5 లక్షల 45 వేలు వేశాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం శుక్రవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

### బహిష్కరణ కేసులో 13 మంది అరెస్ట్


అరెస్ట్ చేసిన వారిని చూపుతున్న డీఎస్పీ

మనోహరాబాద్(తూప్రాన్): వారం రోజుల కిందట సాంఘిక బహిష్కరణ విషయంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో 13 మందిని అరెస్ట్ చేసినట్లు మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో భాగంగా గురు వారం ముగ్గురు, శుక్రవారం 13 మందిని డీఎస్పీ వెంకట్‌రెడ్డి అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిలో ఎర్ర కృష్ణ, బోడ్డు ఆంజనేయులు, పర్శబోయిన నాగరాజు, చిన్నబాల సాయిలు, మాసుల కృష్ణ, చాపల సత్యనారాయణ, కుమ్మరి నాగభూషణం, గోత్రాల స్వామి, రాజబోయిన సాయి లు, నాచారం స్వామి, కుక్కల వెంకటేష్, కర్రె కృష్ణ, చిన్నబాల కనకమ్మలను ఉన్నట్లు తెలిపారు.



# ఇన్‌చార్జీలు ఇంకెన్నాళ్లు?

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని రెగ్యులర్ అధికారులు
- జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లయినా తాత్కాలిక పాలనే
- ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు శాఖలు
- అదనపు బాధ్యతలతో కుంటుపడిన అభివృద్ధి
- ప్రజలకు సకాలంలో అందని సేవలు


మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం

మెదక్ కలెక్టరేట్: ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మెదక్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా ఇప్పటికీ ప్రభుత్వ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేరు. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం 2016లో జిల్లాను విభజించగా మెదక్ 15 మండలాలతో ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. అనంతరం 15 మండలాలను విభజించి 6 కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లాలో మొత్తం 21మండలాలు అయ్యాయి. కానీ ఇందుకనుగుణంగా జిల్లాలో పలు శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించలేదు. దీంతో నేటికీ జిల్లాలో ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతుంది.

మెదక్ జిల్లా కొత్తగా ఏర్పడటంతో సమయానికి సేవలు అందుతాయని ప్రజలు భావించారు. సంగారెడ్డికి వెళ్లాల్సిన బాధ తప్పుతుందనుకున్నారు. కానీ జిల్లా ఏర్పాటుతోపాటు రెగ్యులర్ అధికారులను ఇవ్వకపోడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఉన్న అధికారులకు కూడా రెండు నుంచి మూడు శాఖల బాధ్యతలు అప్పగించడంతో అన్ని శాఖలకు న్యాయం చేయలేకపోతున్నారు. అధికారుల కోసం కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు సమయానికి సేవలు అందడం లేదు. ముఖ్యంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఎంప్లాయిమెంట్ శాఖ, గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్, లీగల్ మెట్రాలజీ, ఎక్సైజ్‌శాఖ వంటి శాఖలకు జిల్లాలో రెగ్యులర్ పోస్టులే లేవు. ఇంకా ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతుంది.

#### ఫుడ్ సేఫ్టీలో కొరవడిన పర్యవేక్షణ

ప్రస్తుతం హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీశాఖలోని అధికారిణి శ్రీశిఖకు మెదక్ ఫుడ్ సేఫ్టీ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో జిల్లాలో హోటళ్ల నాణ్యత పాటించడం లేదు. మరోవైపు కల్తీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటిపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. దీంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, చాట్ బండార్, స్వీట్ షాప్‌లు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయి. ఇటీవల మెదక్ జిల్లా కేంద్రంలోని నాలుగు హోటళ్లలో 70 కిలోల మాంసం నిల్వలు లభించడం, తూప్రాన్, నర్సాపూర్‌లలో ఇటీవల జరిగిన ఘటనలు నిదర్శనంగా చెప్పవచ్చు.

#### ఎంప్లాయిమెంట్ కరువు

జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ అధికారిగా సంగారెడ్డికి చెందిన రామరాజు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రెండు జిల్లాలో విధులు ఉండటంతో మెదక్‌లో ప్రత్యేకంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. దీంతో నిరుద్యోగులకు ఎంప్లాయిమెంట్ గురించి అవగాహన కరువైంది. ఫలితంగా నిరుద్యోగ యువతీ, యువకులు హైదరాబాద్‌కు వలస వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకుంటున్నారు. లేదంటే లేబర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా భూగర్భశాఖ అధికారిగా సంగారెడ్డికి చెందిన వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. జిల్లాలో వ్యవసాయం కోసం రైతులు, ఇళ్ల నిర్మాణాలకు ప్రజలు బోర్లు తవ్విస్తున్నారు. అడ్డగోలుగా బోర్ల తవ్వకాలు జరుగుతున్నాయి. ఎవరూ నిబంధనలు పాటించడం లేదు. లీగల్ మెట్రాలజీ అధికారిగా సంగారెడ్డికి జిల్లాకు చెందిన సుధాకర్ యాదవ్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. కేవలం ఏడుపాయల జాతర సమయంలోనే శాఖ అధికారులు కనిపిస్తారు. మిగితా సమయంలో జిల్లాలో ఎక్కడ అధికారి పని తీరు కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కార్మికశాఖ అధికారిగా రామాయంపేట అధికారి రాజు ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. దీంతో సంక్షేమ పథకాలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### ముఖ్యమైన అధికారులంతా ఇన్‌చార్జీలే..

జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించి సుమారు 15 మందికి పైగానే ఇన్‌చార్జీలు ఉన్నారు. వీరందరికీ అదనపు బాధ్యతలు అప్పగించకపోవడంతో సమయానికి పనులు చేయలేకపోతున్నారు. జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌గా వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా మూర్తి, జిల్లా ఇంటర్ నోడల్ ఆఫీసర్‌గా మాధవి, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌గా శివదయాల్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారిగా నాగరాజుగౌడ్, పశు సంవర్ధశాఖ అధికారిగా వెంకటయ్య, విజయ డెయిరీ డీడీగా గోపాల్‌సింగ్, జిల్లా స్త్రీ.శిశు సంక్షేమ శాఖ అధికారిగా బ్రమ్మాజీ, మార్కెటింగ్ ఏడీగా యాదయ్య, వయోవృద్ధుల విద్యాశాఖ అధికారిగా అనిల్ కుమార్, మార్క్‌ఫెడ్ అధికారిగా క్రాంతి, చేనేత కార్మికశాఖ అధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, సోలార్ డీఎంగా మాణిక్, ఆరోగ్యశ్రీ శాఖ అధికారిగా నరేశ్ ఇన్‌చార్జి అధికారులుగా కొనసాగుతున్నారు.

# స్కీములు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు పథకాలను అమలు చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు


కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, బోర్డు అడ్వాన్సరీ కమిటీని నియమించి ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోరారు. ఈ మేరకు బీసీడబ్ల్యూఎఫ్, సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణాలు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తుందన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. లేకపోతే భవన నిర్మాణ కార్మికులను ఏకం చేసి ప్రభుత్వ మీద తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. అలాగే 23న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట వేలాదిమంది కార్మికులతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెంటయ్య, జిల్లా నాయకులు దత్తు, బాబురావు, సుదర్శన్ పాల్గొన్నారు.

#### జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా వారికి జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సాయిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆరోగ్య శ్రీ ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. 17 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు కనీస వేతనాలు, రెగ్యులరైజేషన్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారిని పర్మినెంట్ చేయడంతో పాటు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అశోక్, ఉద్యోగులు గాయత్రీ, చంద్రకళ, వినోద్, నాగరాజు, సత్యనారాయణ, రమేశ్, నర్సింలు, రవీందర్, శ్యామ్, కైరిన్ తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో మహిళా కూలీ మృతి

- గతంలో తండ్రి ఇప్పుడు తల్లి
- అనాథలైన ఇద్దరు కూతుళ్లు


భూలక్ష్మి (ఫైల్)

దుబ్బాకరూరల్: పాము కాటుకు గురై మహిళ మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రా మంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గ్యార భూలక్ష్మి (48) చర్లపల్లి రాజిరెడ్డికి చెందిన మొక్కజొన్న చేనులో కంకులు తెంపడానికి కూలీ పనికి వెళ్లింది. కంకులు తెంపుతున్న క్రమంలో పాము కాటు వేసింది. ఒక్కసారిగా ఆమె కేకలు వేయడంతో తోటి కూలీలు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించారు. పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి అత్తమ్మ గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

**నాడు తండ్రి.. నేడు తల్లి**

భూ లక్ష్మి భర్త ఆశయ్య కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు కూతుళ్లను కూలీ పనులు చేసుకుంటూ పోషిస్తుంది. తల్లిదండ్రులు మృతి చెందడటంతో అక్కాచెల్లెళ్లు అనాథలుగా మారారు. ప్రస్తుతం వీరిద్దరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

**విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు**

వట్‌పల్లి(అందోల్): విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన అందోలు మండలం తాలెల్మ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పాండు కథనం మేరకు గ్రామానికి చెందిన లక్ష్మయ్య (45) పంచాయతీలో రెండు నెలల కిందట మల్టీపర్పస్ ఉద్యోగిగా చేరాడు. గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఉదయం గ్రామ కార్యదర్శి, లైన్‌మెన్‌లు ఎల్‌సీ తీసుకొని దగ్గరుండి లైట్లు పెట్టించారు. తిరిగి సాయంత్రం వేళలో ఎల్‌సీ తీసుకోకుండా మిగిలిన లైట్లు ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతురాలి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

**చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు..**


కేశయ్య మృతదేహం

పాపన్న పేట (మెదక్): చేపలు వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాయికోటి కేశయ్య(53) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల వేయగా ఆ వల అతడికే తట్టుకొని నీట మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో చెరువులో గాలించి మృతదేహాన్నిబయటకు తీశారు. మృతుడికి భార్య ఆశవ్వతోపాటు కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

# రెండు బైక్‌లు ఢీ

- ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు
- నాందేడ్ జాతీయ రహదారిపై ఘటన


వట్‌పల్లి(అందోల్) : ఘటనా స్థలంలో క్షతగాత్రులు

వట్‌పల్లి(అందోల్): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అందోలు మండలం డాకూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గౌస్ కథనం మేరకు.. సదాశివపేట మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన చంద్రయ్య(60), భార్య మణెమ్మతో కలిసి టీవీఎస్ ఎక్సెల్ పై అందోలు మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి బంధువుల ఇంటికొస్తున్నారు. సంగుపేట వద్ద సర్వీసు రోడ్డు గుండా వెళ్లాల్సి ఉండగా బ్రిడ్జి ఎక్కి కొంత దూరం ప్రయాణించి రాంగ్‌రూట్‌లో వెళ్తున్నామని రోడ్డు పక్కన వాహనం ఆపాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి నారాయణ ఖేడ్ వైపు వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రయ్యకు తీవ్ర గాయాలు కాగా, మణెమ్మతోపాటు మరో బైక్‌పై ఉన్న విజయ్, అతడి భార్య నవ్య, చిన్నారులు శిరీష, ఆర్యన్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ చంద్రయ్య మృతి చెందాడు.

**కారు ఢీకొని మహిళ..**


దుర్గమ్మ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్):కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన పోతంశెట్టిపల్లి చౌరస్తా మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల మల్లయ్య భార్య దుర్గమ్మ (56) మెదక్ పట్టణంలో పని ఉండడంతో వెళ్లి తిరిగి బస్సులో స్వగ్రామానికి ప్రయాణమైంది. పోతంశెట్టిపల్లి చౌరస్తా గేటు వద్దకు రాగానే బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో మెదక్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**లారీ క్లీనర్ పనికి వచ్చి విగతజీవిగా మారి**

మనోహరాబాద్(తూప్రాన్):అనుమానాస్పద స్థితిలో లారీ క్లీనర్ మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. విజయనగరం జిల్లా రాజాం మండలం ఐలపేట గ్రామానికి చెందిన రాంబాబు (43) లారీపై క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్క్రాప్ తీసుకొని మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులో గల ఎంఎస్ అగర్వాల్‌కు వచ్చారు. ఆరుబయట పడుకొని ఉన్న రాంబాబు శుక్రవారం మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. రాంబాబు గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

### కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయనగర్ కాలనీలో గల శ్రీసాయి రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పనిచేసే గంగారం(38) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం తెల్లావారుజామున వాంతులు చేసుకున్నాడు. గమనించిన భార్య వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులకు తాను ఆరు ప్యాకెట్ల ఎలుక మందును తాగినట్లు గంగారం పేర్కొన్నాడు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### నాలుగు గంటల్లోపే వేటు

- చర్చనీయాంశమైన తహసీల్దార్ సస్పెన్షన్
- కలెక్టర్‌పై ప్రశంసలు

రేగోడ్(మెదక్): రేగోడ్ తహసీల్దార్ బాలలక్ష్మి గురువారం సస్పెన్షన్ అయిన విషయం తెలిసిందే. తహసీల్దార్ సస్పెన్షన్ జిల్లాలో చర్చానీయాంశంగా మారింది. మెదక్ ఆర్డీఓ రమాదేవి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సుమారు నాలుగు గంటల్లోపే సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ కావడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆర్డీఓ తనిఖీ చేసిన వెంటనే కలెక్టర్‌కు నివేదించడం.. ఆ వెంటనే వేటు వేయడం చకచకా జరిగిపోయాయి. ఇలాంటి అధికారిపై కఠినంగా వ్యవహరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# మిరప పంటలో గంజాయి సాగు


గంజాయి మొక్కలు చూపుతున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): గుట్టచప్పుడు కాకుండా మిరప పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను శుక్రవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని మర్వెల్లి గ్రామానికి చెందిన జుట్టు చిన్న నర్సింలు వ్యవసాయ పొలంలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా అక్రమంగా సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నాం. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుంది. సదురు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం జోగిపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ పీ.వీణారెడ్డి, ఎస్‌ఐ ఎ.అనిల్ కుమార్, హెడ్‌కానిస్టేబుల్, విఠల్, సిబ్బంది పీ.అనిల్‌కుమార్, డీ.మల్లయ్య, ప్రహ్లాద్ రెడ్డి పాల్గొన్నారు.

# అనారోగ్యంతో యువకుడి మృతి

- ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబీకుల దాడి

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో యువకుడు మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు డాక్టర్‌ను చితకబాదారు. ఈ ఘటన సిద్దిపేటలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన దండు పోచయ్య, విజయ దంపతులకు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం కాగా, కుమారుడు రాజు(20) కూలీ పనులు చేస్తుంటాడు. కూతురు అనారోగ్యానికి గురి కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇంటి వద్ద రాజు ఒక్కడే ఉండటంతో బుధవారం మేనమామ గ్రామమైన రాఘవాపూర్‌కి వెళ్లాడు. అక్కడ జ్వరం రావడంతో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చూయించారు. గురువారం సాయంత్రం పరిస్థితి విషమించిందని ఆర్‌ఎంపీ చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వైద్యుడిపై దాడి చేశారు. శుక్రవారం మృతుడి తండ్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# కండ్లలో కారం చల్లి పుస్తెలతాడు చోరీ

- నర్సాపూర్ సంతలో ఘటన

నర్సాపూర్ : కండ్లలో కారం కొట్టి మహిళ మెడలో బంగారు పుస్తెల తాడును దొంగిలించారు. ఎస్‌ఐ లింగం కథనం మేరకు. ప్రతీ శుక్రవారం నర్సాపూర్‌లో సంత జరుగుతుంది. ఈ క్రమంలో మంతూరుకు చెందిన లక్ష్మి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె కండ్లలో కారంపొడి చల్లి మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డ ఘటన మండల పరిధిలోని రాముని పట్లలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దమ్మ యాదవరెడ్డి భార్య పుష్పలత ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందింది. పురోహితులు కొద్ది నెలలు ఇల్లు వదిలిపెట్టమని చెప్పడంతో సిద్దిపేటలో ఉంటున్నారు. రోజు ఉదయం గ్రామానికి వస్తూ వ్యవసాయ పనులు చూసుకొని తిరిగి రాత్రి సిద్దిపేటకు వెళ్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటికొచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికెళ్లి చూడగా 2 తులాల బంగారం, 16 తులాల వెండి , రూ.520 నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని యాదవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# బంగారం కోసమే మహిళను హత్య

- ఇద్దరు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- యాదగిరిగుట్టకు వెళ్దామని బైక్‌పై తీసుకెళ్లి గొంతునులిమి చంపిన వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇటీవల మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయి పల్లి సాజా తండాకు చెందిన లలిత అదృశ్యమై హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా ఈ కేసు సంబంధించిన వివరాలు డీఎస్పీ శుక్రవారం వెల్లడించారు. తూప్రాన్ మండలం ఘనపూర్‌కు చెందిన ఒకే కులస్తులైన వడ్డే కనకయ్య, వడ్డే ప్రమీళకు కల్లు దుకాణంలో లలిత అనే మహిళ పరిచయమైంది. నిత్యం ఆమెతో కల్లు తాగుతుండేవారు. 11న యాదగిరిగుటట్ట దేవుడి దర్శనానికి వెళ్దామని కొత్త బట్టలు, నగలు వేసుకొని రావాలని లలితకు సూచించారు. తూప్రాన్‌కు వచ్చిన ఆమెను ఇద్దరూ బైక్‌పై యాదగిరిగుట్ట వైపునకు తీసుకెళ్లారు. జగదేవ్‌పూర్ దాటి పీర్లపల్లి అటవీ ప్రాంతంలో లలిత గొంతు నులిమి చంపేసి వెండి కడియాలు, మట్టిలు, చెవి కమ్మలు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. నగలను తూప్రాన్‌లోనే ఓ షాపులో తాకట్టు పెట్టి బైకును కొనుగోలు చేశారు.

#### కూతురు ఫిర్యాదుతో..

లలిత కనిపించకపోవడంతో 14వ తేదీన కూతురు దేవి చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సాంకేతికత ఆధారంగా విచారణ చేపట్టి అనుమానితులైన వడ్డే కనకయ్య, ప్రమీళను అదుపులోకి తీసుకొని విచారించారు. నగల కోసమే హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకోవడంతో ఘటనా స్థలానికి వెళ్లి లలిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితుల నుంచి బంగారం, నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసు ఛేదనలో కృషి చేసిన రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, సిబ్బంది సత్తయ్య, గట్టేశ్, భాస్కర్, రమేశ్, మహేశ్, హర్షద్‌లను డీఎస్పీ అభినందించారు.

**వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. హవేళిఘణాపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేశ్‌కుమార్ 3 నెలలుగా మెదక్ పట్టణంలోని ఫతేనగర్, జంబికుంట, దాయర కాలనీల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ మేరకు దొంగను గుర్తించి పట్టుకున్నారు. అతడి వద్ద రూ.2లక్షల నగదు, 17.5 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకొని, నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.